# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 24 ఫిబ్రవరి 2025






## నూతన సూర్యభగవాన్ విగ్రహావిష్కరణ

సిద్దవటం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:





మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారికి కనుమలోపల్లి సమీపాన వెలసిన శ్రీ ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం నూతన విగ్రహాల ఆవిష్కరణ శ్రీ పంచముఖ గణపతి, శ్రీ నీలకంఠేశ్వర మరక లింగేశ్వర స్వామి, శ్రీఉమాదేవి అమ్మవారు శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి సూర్యనారాయణ స్వామి విగ్రహాలను ప్రతిష్టించడం జరిగిందని ఆలయ మరియు హరివాహ దేవతల నూతన విగ్రహగా ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా నిత్యపూజ, మార్జనలు, పీఠన్యాసం, గర్తన్యాసం, రత్న న్యాసం, రత్న న్యాసం, సుంహుర్తామునకు యంత్రస్థాపన, బింబ ప్రతిష్టలు, మూలమంత్ర స్థాపన, బింబ ప్రతిష్టలు, మూల మంత్ర హోమంలు, మహా మంగలి పూర్ణాహుతి, అగ్ని ప్రదక్షిణం, ప్రధాన కలశ, ఉద్వాసన, మహాకుంభాబిషేకం, అభిషేకాలు కలకళ వియోచనం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామి పూజ శ్రీకృష్ణమాచార్య గురూజీ వచ్చిన భక్తులు స్వామి వారి ఆశీస్సులు తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ అధినేత బాబు ఆలయ అర్చకులు, చైతన్యస్వామి భక్తులు పాల్గొన్నారు.

## మైలపల్లిలో ఘనంగా ధ్వజప్రతిష్ట

చిట్వేలి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:



మండల పరిధిలోని మైలపల్లి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజ ప్రతిష్ట ఆదివారం ఉదయం 11:15 లకు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. శనివారం మొదలైన ఈ ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం కళ్యాణంతో ముగుస్తుందని ఆలయ ధర్మకర్త వడ్డే శంకర్ రెడ్డి తెలిపారు. రాయి పెద్ది సుబ్బు శర్మ, రాజశేఖర్ శర్మలు ప్రతిష్ట కార్యక్రమాన్ని వేదమంత్రాలతో జరిపించారు. మండల పరిధిలోని వందలాదిమంది భక్తులు ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పెద్దలు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

# హక్కుల సాధనతో పాటు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలి

- విజిబుల్ పోలీసింగ్‌తో మంచి ఫలితాలు
- ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తాం
- చైతన్యం కోసమే అన్నమయ్య పోలీసు వాట్సఫ్ ఛానల్
- అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)

మనకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనతో పాటు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని జిల్లా ప్రజలకు అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడుపతదరు పిలుపునిచ్చారు. అన్నీ ప్రభుత్వమే చేయాలని భావించకూడదని మన వంతు సహకారం కూడా అవసరమైన సమయాల్లో పరిశుభ్రత లాంటి కార్యక్రమాలకు అందించాల్సి ఉందన్నారు. ఆదివారం ఉదయం స్థానిక రీజెన్సీ నలందా విద్యాసంస్థలు రాజంపేట పాత బస్టాండు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన రెండవ విడత స్వచ్ఛంధ పరిశుభ్రత సేవా కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత బస్టాండు సర్కిల్‌లో పరక చేతబట్టి చెత్తను స్వయంగా ఊడ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛతలో రాజంపేట ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని పిలుపినిచ్చారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల చేరువకు పోలీసుశాఖను తీసుకెళ్ళాలన్నదే తమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగానే ఈ సేవా కార్యక్రమానికి రావడం జరిగిందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రభుత్వ పాఠశాలలు కూడా భాగస్వామ్యమవ్వాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే ప్రజల్లో చైతన్యం కోసం, చట్టాలపై అవగాహన ఏర్పడేందుకు పోలీసు వాట్సఫ్ ఛానల్‌ను ప్రారంభించామన్నారు. పోలీసు ఛానల్‌లో ప్రతి ఒక్కరూ మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) సాంకేతిక ఆధారంగా జిల్లాలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, శాంతి భద్రతలకు నిఘా వ్యవస్థను పటిష్టపరిచే దిశగా అడుగులు ముందుకేస్తున్నామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంట లిజెన్సీ సాంకేతికతను శాంతి భద్రతల పరిరక్షణలో ఏ విధంగా ఉపయోగించుకోవచ్చన్న అంశాలపై సమీక్షి స్తున్నామని, త్వరలో జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామన్న రీజెన్సీ నలందా విద్యాసంస్థల అధినేత జిఎన్ నాయుడుకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందుగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం పట్ల విద్యార్థులను అభినం దించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజ ఉద్ధరణ జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజికంగా, స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకోవాలని తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో రీజెన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.ఎన్.నాయుడు, ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి (మురళి), మాజీ ఎంపిటిసి గుడారు సుబ్రమణ్యంనాయుడు, విద్యాసంస్థల సిఇఓ గుడారు చందు. ఉపా ధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా గతం లో రీజెన్సీ నలందా విద్యాసంస్థలు చేపట్టిన స్వచ్ఛంధ పరిశుభ్రత సేవా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొనడం జరిగింది.

**- సేవా కార్యక్రమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు**

ఆదివారం రాజంపేటలో జరిగిన పరిశుభ్రత సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు సేవా కార్యక్రమాల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరచడం జరిగింది. విద్యార్థులతో కలిసి రాజంపేటలో స్థానిక మున్సిపల్ పార్కులో ఎస్పీ చెత్తను ఊడ్చి పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అంతే కాకుండా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాల్సి ఉందన్నారు. తద్వారా ప్రజల్లో చైతన్యం వస్తుందన్నారు. సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులయ్యేందుకు పరిస్థితులు సానుకూలమవుతాయని ఎస్పీ భావన. ఇప్పటికే ప్రజల్లో పోలీసుశాఖపై నమ్మకం పెరిగే దిశగా పట్టణాల్లోని, కాలనీలను పోలీసులు సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు వీలుగా విజిబుల్ పోలీసింగ్‌ను ప్రణాళికాబద్ధంగా అమలుచేసేందుకు కార్యాచరణను రూపొందించిన ఎస్పీ ఇందులో భాగంగానే తాను ఈ సేవా కార్యక్రమానికి వచ్చినట్టు వివరించారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి ఆధునిక టెక్నాలజీ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్ళేందుకు ఇప్పటికే అన్నమయ్య పోలీసు పేరుతో ఓ ఛానల్‌ను ప్రారంభించి నూతన ఒరవడికి ఎస్పీ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అంతకు మించి చట్ట పరిధిలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వసనీయత పెంచేలా విధులు నిర్వర్తించాలని జిల్లాలోని పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ వికలాంగులు, మహిళలు, వృద్ధులు, బాధిత ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పోలీసుశాఖకు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేశారు. విభిన్న సేవల ద్వారా పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలని భావిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కృషి రానున్న రోజుల్లో ఫలించాలని ఆశిద్దాం.



## జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు

**జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు**

**ఉదయం పరీక్షకు 87.74 అభ్యర్థులు హాజరవ్వగా మధ్యాహ్నం పరీక్షకు 87.48 హాజరు**

కడప, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాల్లో జరిగిన గ్రూప్2 మెయిన్స్ పరీక్ష ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్2 ఉద్యోగాల నియామకం కోసం ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించిన మెయిన్స్ పరీక్షకు సంబందించి.. జిల్లాలోని 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5,825 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. ఉదయం సెషన్ లో 5,111 మంది అభ్యర్థులతో హాజరు శాతం 87.74 గా నమోదైంది. అలాగే మధ్యాహ్నం సెషన్ లో 5,825 మందికి గాను 5,096 మంది పరీక్షకు హాజరై.. అభ్యర్థుల హాజరు శాతం 87.48 గా నమోదైందన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించాయన్నారు.

## శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

**- గండిమడుగుకు పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు**

గాలివీడు, ఫిబ్రవరి 23(ప్రభాతవార్త):



మండలంలోని ఎంతో మహిమాన్విత చారిత్రక ప్రాధాన్యత ఉన్న గండిమడుగు ఉమామహేశ్వరస్వామి ఆలయం భక్తుల పాలిట కొంగు బంగారంలా బాసిల్లుతున్నది. పాపాఘ్నినదిపై సహజసిద్ధంగా ఏర్పడిన నీటిమడుగులో స్నానాలు ఆచరిస్తే పాపాలు తొలగిపోయి పుణ్యం లభిస్తుందని పెద్దలు చెబుతున్నారు. అలాగే గండిమడుగు పక్కనే వెలిగల్లు జలాశయం, పచ్చని పార్కు మొదలైనవి ఉండటంతో పర్యాటకులు అధిక సంఖ్యలో రానున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చే భక్తులకు స్థానిక శ్రీ వేంకటేశ్వర హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, గోల్డ్ రామాంజులు, టపాసులు ఆర్యశంకర వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరుగునని ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని అరవీడు శివాలయం, ఎగువగొట్టివీడు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగునని ఆలయాల ప్రధాన అర్చకులు తెలిపారు.

## ఆశాజనకంగా మామిడి పూతలు

చిట్వేలి, ఫిబ్రవరి 22, ప్రభాతవార్త:

పండ్లలో రారాజు అయిన మామిడి ఈ ఏడాది రైతుల్లో ఆశలు పెంచుతూ ఉంది. వర్షాలతో పూతల రావడం కాస్త ఆలస్యమైనా దాదాపుగా అన్నిచోట్ల అన్ని మామిడి రకాలు ఆశాజనకమైన పూతలను సూచిస్తున్నాయి. రైతులు ఇప్పటికే పూత నిలిచి పిందెగా మారెందుకు పలు రకాల పురుగుమందులను పిచికారి చేస్తున్నారు. పూత దశ నుంచి కాయగా మార్పు చెందే వ్యవధిలో సుమారు నాలుగు సార్లు పురుగు మందులకు అయ్యే ఖర్చులు మాత్రం తగ్గడం లేదని రైతులు బాధను వ్యక్తపరుస్తున్నారు. ఖర్చు తక్కువతో కూడిన ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపేట వేస్తున్నప్పటికీ రైతుల్లో అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది వెనుకబడి ఉన్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పురుగుమందుల కంపెనీ దారులు, వ్యాపారస్తులు సూచించిన మందులకు రైతులు అధికంగా ఖర్చు చేస్తున్నారు. గత ఏడాది ధరలు అధికంగా ఉన్నప్పటికీ అతి తక్కువ దిగుబడి ఉండడంతో మామిడి రైతులకు నిరాశ మిగిల్చింది. కాగా ఈ సంవత్సరం ప్రారంభం పూతల దశలు ఆశాజనకంగా ఉండడంతో సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నాను. ప్రకృతి వైపరీత్యాలు లేకుండా వాతావరణం అనుకూలిస్తే మామిడి రైతుకు మేలు జరుగుతుందని పలువురు రైతులంటున్నారు.



# లక్ష్మీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి

రాయచోటి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త

రాయచోటి పట్టణంలోని ఎస్పీ ఆఫీసు సమీపంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రజలకు అనుకూలమైన ప్రాంతంలో లక్ష్మీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ ఆసుపత్రి నందు ఎమర్జెన్సీ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఈఎన్ టి, క్రిటికల్ కేర్, తదితర వ్యాధులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా బీపీ, షుగర్, కంటి వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య సేవలు అందించడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. ఈ ఆసుపత్రి దిన దినాభివృద్ధి చెందాలని డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు.





# ప్రకృతి వ్యవసాయానికి మార్గదర్శిగా బాలచంద్ర





రసాయనిక వ్యవసాయం సర్వసాధారణమైన ఈ రోజుల్లో, చెన్నూరు మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన దండబోయిన బాలచంద్ర, ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శంగా నిలిచారు. జువాలజీలో బీఎస్సీ పూర్తి చేసి, తొమ్మిదేళ్ల వ్యవసాయ అనుభవాన్ని కలిగి ఉన్న బాలచంద్ర, ప్రకృతి వ్యవసాయాన్ని స్వీకరించి, పర్యావరణానికి అనుకూలమైన విధానాలు లాభదాయకమని నిరూపించారు. తన తండ్రి నుంచి ఐదు ఎకరాల భూమిని స్వీకరించిన బాలచంద్ర, సంప్రదాయ వ్యవసాయం చేస్తుండగా, రసాయనిక వ్యవసాయంలోని లోపాలను గమనించారు. అధిక పెట్టుబడులు, తక్కువ దిగుబడులు, నేల నాణ్యత తగ్గడం, వ్యవసాయ ఖర్చులు పెరగడం, రసాయనాల ప్రభావంతో భూమి నశించడం, ఈ పరిస్థితులన్నీ రైతుగా తన ప్రయాణంలో ఆయనను ఆలోచనలో పడేశాయి. 2018లో గుంటూరులో ప్రభుత్వం జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం నిర్వహించిన సుభాష్ పాలేకర్ శిక్షణలో పాల్గొని, మహారాష్ట్రలో ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం, ప్రకృతి వ్యవసాయాన్ని స్వీకరించాలని నిర్ణయించుకున్నారు. అలాగే యూట్యూబ్ వీడియోలు మరియు వేద వ్యవసాయ పద్ధతుల అధ్యయనం ద్వారా మరింత జ్ఞానం సంపాదించారు.

ప్రస్తుతం బాలచంద్ర తన భూమిలో పసుపు, వరి వంటి ప్రధాన పంటలతో పాటు, టమోటా, మిరప, కాకర, వంకాయ వంటి అంతర పంటలను సాగు చేస్తున్నారు, ముఖ్యంగా రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న పసుపు పంట అతని విజయం గురించి ప్రతిబింబిస్తోంది. ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తూ, పసుపు నాటడానికి ముందు పసుపు కొమ్ములను బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరిగింది, అలాగే భూమి ద్వారా విత్తనం ద్వారా పంటలకు సంక్రమించే తెగులు అరికట్టింది. ఎకరాకి 400 కిలోల చొప్పున మొత్తం 800 కిలోల ఘనజీవామృతం విత్తనంతో పాటు కలిపి వేసుకోవడం ద్వారా విత్తనానికి కావలసిన తేమ అంది సమర్థవంతంగా మొలకెత్తడానికి దోహదపడింది. అలాగే జీవ ఉద్దీపన (bio-stimulant) చేయించి తద్వారా భూ మిని సారవంతం చేసింది. ద్రవజీవామృతాన్ని ప్రతి 15 రోజు లకు ఒకసారి నీటితో కలిపి పొలంలో వాడటం ద్వారా మొక్క లకు ఆరోగ్యకరమైన వృద్ధి కలిగింది. అదనంగా, దశపర్ణి కషాయం, పంచగవ్య గ్రోత్ ప్రమోటర్లు, మట్టి ద్రావణం వాడటం వల్ల తెగుళ్లను నివారించగలిగారు,

ప్రకృతి వ్యవసాయానికి మారిన తరువాత బాలచంద్ర అద్భుత ఫలితాలను సాధించారు. రూ.2.7 లక్షల పెట్టుబడితో పసుపు సాగు ప్రారంభించినప్పటికీ, రూ.10 లక్షలకు పైగా ఆదాయం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర, బెంగుళూరు, భోపాల్ వంటి ప్రాంతాల నుండి అతని పసుపు పంటకు డిమాండ్ పెరిగింది, మహారాష్ట్రకు చెందిన ఒక సంస్థ 25 క్వింటాళ్ల పసుపు కొమ్ములకు ముందస్తు ఆర్డర్ ఇచ్చింది. బాలచంద్ర వ్యవసాయ పద్ధతుల్లో తేడా స్పష్టంగా కనిపిస్తోంది. తన పొలంలో జూన్ 27న నాటిన పసుపు పంట ఇప్పటికీ నిలకడగా పెరుగుతోంది, కానీ ఇతని కంటే తరువాత నాటిన ఇతర రైతుల పొలాలు వాలి పోయాయి, ఇది ప్రకృతి వ్యవసాయం ఎంత ప్రతిస్పందనీయమైనదో నిరూపిస్తోంది. అలాగే, బాలచంద్ర పొలంలో పండిన పసుపు కొమ్ములు బరువులో, నాణ్యతలో విశేషంగా మెరుగుపడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

బాలచంద్ర విజయాన్ని పలువురు జిల్లా యంత్రాంగం గుర్తించారు. రిపబ్లిక్ డే ప్రదర్శనలో తన ఉత్పత్తిని ప్రదర్శించి, వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చేకూరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ ప్రశంసించారు, ప్రొద్దుటూరు, గుంతకల్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. అతని విజయాన్ని చూసి గ్రామంలోని మరికొందరు రైతులు వచ్చే సీజన్ లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

**లక్ష ఎకరాలను సాగులో తేనున్నాం..!..**



జిల్లాలో వచ్చే ఏడాదిలోపు లక్ష ఎకరాలను సేంద్రియ పద్ధతిలో సాగులోకి తేవాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వ్యవసాయ అనుబంధ శాఖల సమన్వయంతో గ్రామాల్లో ఉద్యాన పంటల సాగును పెంపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాం. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన, ప్రకృతి సాగు, పాడి, మత్స్య సంపదను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సాగులోకి తీసుకు వచ్చిన వ్యవసాయ భూముల్లో సహజ పద్ధతుల ద్వారానే సేంద్రియ వ్యవసాయ సాగును అనుసరించి దిగుబడులను సాధించాలని సూచించారు. సేంద్రియ సాగుబడిలో పండించిన దిగుబడులకు ఇప్పు డిప్పుడే పట్టణ ప్రాంత ప్రజల నుండి ఆదరణ మరింత పెరు గుతోంది. భవిష్య తరాలకు ప్రకృతి వ్యవసాయం యొక్క అవసరం, ఆవశ్యకత ఎంతో ఉంది. ప్రకృతి వ్యవసాయ సాగు బడి, అందులో లాభాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృత స్థాయి అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకర దిగుబడులను ఉత్పత్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలి. మన ఇంటి పరి సరాల్లోనే.. మనకు సరిపడా కూరగాయలను పండించుకో వచ్చు. తడి,పొడి చెత్త వేరు చేసుకుని.. ఇంటివద్దే సేంద్రియ ఎరువును తయారు చేసుకోవాలి. అంతేకాకుండా.. 5 అంతస్తుల పంటల విధానం, ఎస్సి, ఎస్టీ భూముల్లో ప్రకృతి వ్యవసాయం, సుస్థిర మెట్ట సేద్య పద్ధతి, స్వయం సహాయక సంఘ సభ్యులకు న్యూట్రీ గార్డెన్స్, అంగన్వాడీ కేంద్రాలలో న్యూట్రీ గార్డెన్స్ పెంపకంపై దృష్టి సారించాం.

**డా. శ్రీధర్ చెరుకూరి, కలెక్టర్, వైఎస్ఆర్ జిల్లా**

**రసాయనాలను ఉపయోగించి నేలను పాడుచేయవద్దు.**



తల్లి తొమ్మిది నెలలు మాత్రమే మమ్మల్ని మోయగలదు, కానీ భూమి మన జీవితకాలం మనకు పోషణ ఇస్తుంది. అందుకే, భూమిని కాపాడండి, ప్రకృతిని సంరక్షించండి" అని బాలచంద్ర రైతులకు సందేశం ఇస్తున్నారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రచారం చేసేందుకు, మరింత మంది రైతులను ప్రకృతి వ్యవసాయ విధానాల్లో శిక్షణ ఇచ్చేందుకు, ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించేందుకు బాలచంద్ర కృషిచేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని తన జీవన విధానంగా స్వీకరించి, రైతులకు మార్గదర్శకత్వం అందిస్తూ, భారతీయ వ్యవసాయానికి కొత్త ఆశను కలిగిస్తున్న బాలచంద్ర, నిజమైన మార్పు తెచ్చే రైతుగా నిలిచారు.

**దండబోయిన బాలచంద్ర, రైతు**

# విద్యార్థులకు విద్యతోపాటు దేశభక్తి, మానసిక స్థైర్యం అందివ్వడమే లక్ష్యం





**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
పిల్లలకు విద్యతోపాటు పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి, మానసిక స్థైర్యం, సమరయోధుల సేవా స్ఫూర్తి, క్రమశిక్షణలు అలవర్చడంతోపాటు వారి సమాజిక వికాసానికి తోడ్పాటు అందివ్వడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు శ్రీభువన విద్యాలయం వ్యవస్థాపకురాలు జి. ఉమారమాదేవి తెలిపారు. పీలేరు పట్టణ శివారు ప్రాంతమైన చిత్తూరు మార్గంలోని శ్రీభువన విద్యాలయంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రెండు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 350 మంది విద్యార్థులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 8 మంది శిక్షకులు శిక్షణ ఇవ్వడం కోసం హాజరయ్యారన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ (బాలభటులు) అంటే ఏంటని విద్యార్థులకు అర్థాన్ని వివరిస్తూ, విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపుతూ, ఏకాగ్రత, క్రమశిక్షణను అలవర్చడానికి, వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం దోహదపడేలా ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి తమ విద్యాలయం వేదిక అయినందుకు తమకెంతో సంతోషంగా ఉందని అన్నారు. పిల్లల్లో వ్యక్తిత్వాన్ని పెంచడం, మంచి ఆరోగ్య అలవాట్లను నేర్పడం, చేతి వృత్తుల్లో శిక్షణ ఇవ్వడం, వారికి ఉపయోగకరమైన విద్యా పరమైన నైపుణ్యాలను నేర్పడం, సమగ్ర సేవా స్ఫూర్తిని స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా అందించి పిల్లల వికాసానికి తోడ్పాటు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి దోమ చెన్నారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కమిషనర్ గమిడి స్వర్ణలత, స్కౌట్ మాస్టర్స్ దివాకర్ రెడ్డి, తేజ రెడ్డి, సుదర్శన్, ఠాగూర్ నాయక్, గైడ్ కెప్టెన్స్ నర్మద, ఝాన్సీ రాణి, శ్రీ భువన విద్యాలయం ప్రిన్సిపాల్ గుణ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసి కుల జనగణన చేయాల్సిందే




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
బిసికుల జనగణన చేయాల్సిందేనంటూ రౌండ్ టేబుల్ సమావేశంలో బిసినేతలు డిమాండ్ చేశారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో బిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటినుంచి వెనుకబడిన వర్గాల ప్రజలకు జనాభా నిష్పత్తి ప్రకారం తగిన ప్రాధాన్యత అందలేదన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో బిసి జనాభా సంఖ్యలో సగం మాత్రమే వాటా లభిస్తోందన్నారు. జనాభా నిష్పత్తి కంటే అవకాశం తక్కువ రావడం అణిచివేతకు కారణం అవుతుందన్నారు. రాష్ట్ర మైనార్టీ నాయకులు షమీ మాట్లాడుతూ దేశంలో బిసిలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేసి బిసిల నిజాయితీని చాటుకోవాలన్నారు. రాష్ట్ర బిసి అధ్యక్షులు మురళీ మోహన్‌యాదవ్, రాష్ట్ర కురబసంఘం అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు పద్మావతి, డివి.రమణ, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్‌లు మాట్లాడుతూ దేశంలో అన్ని కులాలను లెక్కించి బిసి కులాలను కూడా లెక్కించి వారికి రావాల్సిన వాటాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలన్నారు. రాష్ట్రంలో మురళీధర్ రావు కమీషన్ సిఫారసు అమలు చేయాలన్నారు. బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు సాంబశివ, సిపిఎం శ్రీనివాసులు, బజెపి బండి ఆనంద్, టిడిపి బిసిసెల్ రెడ్డిప్రసాద్‌లు బిసి డిక్లరేషన్‌కు మద్దతు పలికారు. బిసి కులసంఘ నాయకులు ముక్తకంఠంతో బిసి కులగణన జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిశ్రీనివాసులు, రామ్మూర్తి, ఉత్తన్న, నాగరాజ, వీరభాస్కర్, మనోహర్‌రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బిసి నేత కరాటే మాస్టర్ ఏఆర్.సురేష్ మృతి



మృతదేహాన్ని సందర్శిస్తున్న టిడిపి నాయకులు

**మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
బిసి ఉద్యమ కారుడు, కరాటే యూత్‌క్లబ్ మాస్టర్, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ ఏఆర్.సురేష్ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, బిసి కులసంఘాల నాయకులు, పాత్రికేయులు, కరాటే మాస్టర్లు సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతి తీరనిలోటు అని కొనియాడారు. కరాటే యూత్‌క్లబ్‌లో పలువురికి కరాటేను నేర్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో డాక్టర్ ఏఆర్.సురేష్ అవార్డులు పొందారు. అంతేకాకుండా సామాజిక సేవ, బిసి కులాల ఐక్యతకు ఎనలేని కృషి చేశారు.

## ఎంటిఎస్ పథకాలు వర్తింపు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ సంక్షేమ పథకాలు వర్తింప చేసి పదవీవిరమణ యవస్సు 62ఏళ్ళకు పెంచాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని చలపతిరావు కాలనీలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటిలో కరోనా సమయం నందు ఐదేళ్ళ నుంచి పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులకుగా గుర్తించి వారికి యూపిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. అప్కాస్‌ను కొనసాగించాలన్నారు. ఇచ్చిన హామీల ప్రకారం సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింప చేయాలన్నారు. ప్రైవేటు ఏజెన్సీలో ఉన్న వారిని ఉద్యోగులకు నెలనెల వేతనాలు చెల్లించకుండా ఇవాల్సిందానికన్న తక్కువ వేతనాలు ఇచ్చారన్నారు. కార్మికుల సమస్యలపై మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం, 6న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, వృద్విరాజ్, ముభారక్, శేఖర్, ప్రమీల, ఈశ్వరమ్మ, అనూరాధ, రేణుక పాల్గొన్నారు.

## సుప్రజ టెక్నాలజీస్‌తో మిట్స్ ఒప్పందం

**కురబలకోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**



ఎంఓయు చేస్తున్న ప్రతినిధులు

సుప్రజ టెక్నాలజీస్ కంపెనీతో మిట్స్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకొంది. ఏపిలోనే విజయవాడకు చెందిన సుప్రజ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో అవగాహన ఒప్పందం వల్ల విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, వాస్తవ ప్రపంచ సైబర్ సెక్యూరిటిలపై శిక్షణను అందించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం కుదుర్చుకొన్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. ఆ కంపెనీ వ్యవస్థాపకులు సిఈఓ సంతోష్ చనువాడి ప్రొఫెసర్ అండ్‌హెడ్ డాక్టర్ గంగాదేవి ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగస్వామ్య అభ్యాసం, మరియు పరిశ్రమల అవసరాల అంతరాన్ని తగ్గిస్తుందని విద్యార్థులు సైబర్ సెక్యూరిటీలో అత్యాధునిక జ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మథురసన్ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

### ఛైర్మెన్ కాకర్ల క్రిష్ణమూర్తి



**కురబలకోట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
అంగళ్ళుకు సమీపంలోని మల్లయ్యకొండలో వెలసిన శ్రీ అఖండ మల్లేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. మహాశివరాత్రిని పురష్కరించుకొని వివిధ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మెన్ కాకర్ల క్రిష్ణమూర్తి తెలిపారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పుష్పపల్లకిలో ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన మహా మంగళహారతిని నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద గోపూజతో ప్రారంభమై గంగా, గణపతి, రుద్రాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శివరాత్రికి భక్తుల జాగరణ కోసం హరికథా, భరతనాట్యం, దేవరెద్దులు, కోలాటాలు, పిళ్ళనగ్రోవిలతో అలరింప చేయనున్నట్లు తెలిపారు. గురువారం బ్రహ్మముహూర్తం నందు దీపస్థంభంపై భారీ కర్పూర హారతి, ప్రత్యేక తీర్థప్రసాదాలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగళ్ళు నుంచి కొండపైకి ప్రత్యేక ఆర్టీసి బస్సులు నడపనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం ఆలయాన్ని ముస్తాబుచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన తెలిపారు.

## అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలి

### డిఎస్‌పికి ఫిర్యాదు చేసిన ముస్లిం సంఘులు



డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం మతపెద్దలు

**మదనపల్లె, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
టిప్పు సుల్తాన్ వక్ఫ్ భూముల్లో అక్రమంగా ప్రవేశించి ముస్లింలు, జమాత్ పెద్దలకు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వ్యతిరేకంగా మాట్లాడిన శంకర్‌రెడ్డి ఆడిటర్ శ్రీనాథ్, అతని భార్య రమ్య, భక్షు, షరీఫ్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం మతపెద్దలు డిఎస్‌పి దర్బార్ కొండయ్యనాయుడుకు ఆదివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఈ భూములు వక్ఫ్‌కు సంబంధించినవి అని, దీనిపై సర్వహక్కులు జామియా మసీదుకు చెందాతాయని ఓఎస్‌నెంబర్ 33/94లో 2005లోనే మదనపల్లె సీనియర్ సివిల్ కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికి కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ, సమాజంలో అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జామియా మసీదు కేర్ టేకర్ కమిటీ అధ్యక్షులు సర్వార్, న్యాయవాధి నాయబ్ సికింధర్ అలీఖాన్, అక్బర్ బాషా, ఖాజాహుస్సేన్, అహ్మద్ బాషా, షంషీర్, ఇంతియాజ్, జలాల్ సాహెబ్, పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాము




**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**
జిల్లాలోని ప్రైవేట్ అని ఎడిట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం సంఘం నూతన అధ్యక్షులు బిఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గోల్డెన్ పార్కులో ఏర్పాటుచేసిన కృస్మా సర్వసభ్య సమావేశంలో 2025 27 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నూతన అధ్యక్షులుగా వేంపల్లి కు చెందిన బి.వి.రమణారెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన బాల సుబ్బారెడ్డిని కోశాధికారిగా మైదుకూరుకు చెందిన ఏ ఆంజనేయులును ప్రజాస్వామ్య బద్ధంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లాలోని వివిధ నియోజకవర్గాల అధ్యక్ష, ఉపాధ్యక్ష కార్యదర్శులను మరియు కార్యవర్గ సభ్యులు 35 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బివి రమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేసే క్రమంలో అవసరమైన ఆర్థిక బలం సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా సంఘానికి నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు అందరినీ కలుపుకొని సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు ఎన్ సోమశేఖర్ రెడ్డి పూర్వాధ్యక్షులు పల్లేటి ప్రభాకర్ రెడ్డి ఎం అశోక్ రెడ్డి గౌరవాధ్యక్షులు బి చక్రపాణి రెడ్డి జి మాధవి రెడ్డి మరియు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 150 మందికి గరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## తగ్గిన చికెన్ అమ్మకాలు

**దువ్వూరు, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**



గత 20రోజులుగా కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాపించిందనే కారణంతో మండలంలో చికెన్ అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఆదివారం వస్తే సుమారు దువ్వూరులో 1000కిలోల చికెన్ అమ్మకాలు జరిగేవి. అయితే ప్రస్తుతం 100 కేజీలు కూడ అమ్ముడుపోవడం లేదని చికెన్ అమ్మకం దారులు తెలిపారు. గతంలో 200ఉండే చికెన్ ధర ప్రస్తుతం 140కు తగ్గిన చికెన్ కొరకు ఎవరూ రాకపోవడం విశేషం. ధర తగ్గిన బర్డ్ ఫ్లూ కారణంతో చికెన్ కొనుగోలు చేసేందుకు వినియోగదారులు రావడం లేదు. అలాగే కోడిగుడ్ల పరిస్థితి కూడ అలాగే ఉంది. ధర తగ్గిపోవడంతో కోడి గుడ్ల అమ్మకాలు కూడ తగ్గాయి. ఏదిఏమైనా బర్డ్‌ఫ్లూ కారణంగా దువ్వూరు మండలంలో చికెన్ అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయి మాంసం వ్యాపారానికి గిరాకి వచ్చిందని చెప్పవచ్చు. ప్రతి ఆదివారం మండల కేంద్రమైన దువ్వూరు, గుడిపాడులో పొట్టేళ్లను ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేసి మాంసం విక్రయదారులు అమ్ముతున్నారు. అలాగే చేపలకు కూడ గిరాకి వచ్చింది.

## మాదిగల ఇళ్ళకి రక్షణ కల్పించండి



దురాక్రమమైన స్థలంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
మండలంలోని జాండ్ల పంచాయతీ బసిరెడ్డిగారి పల్లి మాదిగపల్లెలో వ్యక్తి దౌర్జన్యంగా జెసిబి సహాయంతో ఇండ్ల వార నాటుకున్న చెట్లను పెరికి వేయడం చాలా దారుణమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామ కృష్ణ తెలిపారు ఈ సందర్భంగా ఆయన ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులుతో మాట్లాడి అక్కడి జరుగుతున్న అన్యాయంపై ఆరా తీశారు ఇలాంటి దారుణం ఎక్కడ జరగలేదని ఒక దళిత గ్రామానికి రక్షణ లేకుండా పోతుందని వారి సొంత భూమి అయితే రాత్రికి రాత్రే జెసిబిలతో పీకి వేయాల్సిన పని ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జెసిబితో చదును చేస్తుండగా అక్కడ నివాసస్తులు అడ్డుకొని ఇది మా ఇండ్ల జాగా ఇక్కడ ఎటువంటి పనులు చేయొద్దని ఆక్షేపించారు దీంతో అతను మీ ఇండ్ల దగ్గర చేయలేదు మేం పక్కన మా భూమి చదును చేసుకుంటున్నామని మాయమాటలు చెప్పి శనివారం రాత్రి వేకువజామున అందరూ నిద్రలోకి జారుకున్న సమయంలో జెసిబి సహాయంతో టెంకాయ చెట్లను వేర్లతో సహా తీసి గుంతలోడి గుంతలో పూడ్చివేశారు. ఉదయం నిద్ర లేచి చూడగానే గ్రామస్తులు హావాక్కయ్యారు ఇదేమని ప్రశ్నించగా వారిని ఇష్టమొచ్చినట్లు దౌర్జన్యంగా కులం పేరుతో దూషిస్తూ మీకు దిక్కునచోటి చెప్పుకోండి ఇది నా పొలము మీకేమన్నా పట్టాలు ఉంటే తెచ్చుకొని కొలిపించుకోండి అని వారిపై దౌర్జన్యం చేయడంతో విదిలేని పరిస్థితిలో ఎమ్మార్పీఎస్ నాయకులను ఆశ్రయించి మేము గత 100 సంవత్సరాలు నుండి ఇక్కడ ఊరు ఉన్నదని కానీ వ్యక్తి దౌర్జన్యంగా మా ఇండ్ల పైకి వచ్చి మా స్థలాలు కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయంపై గ్రామస్తులు పీలేరు పోలీసులను ఆశ్రయించారు ఈ మేరకు పోలీసులు విచారించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు ఏది ఏమైనా రెవెన్యూ అధికారులు ఆ గ్రామానికి సంబంధించి సరిహద్దులు చూపి గ్రామ స్థలానికి రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, ఎంఎస్పి సీనియర్ నాయకులు ఈపూరి వెంకట రమణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**
పోరుమామిళ్లలోని వివేకానంద భవనము నందు సిఐటియు ఆధ్వర్యంలో పోరుమామిళ్ళ ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్ యూనియన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణము, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు యొక్క సంక్షేమ పథకాలు లబ్ధి పొందుటకు వెంటనే కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రిషన్లు ప్రభుత్వ ద్వారా పొందిన గుర్తింపు కార్డులను ప్రతి సంవత్సరము రెన్యువల్ చేయించుకోవాలని, లేదా ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలన్నారు. కార్మికుని కుమార్తె, కుమారుడు వివాహ కానుక లక్ష రూపాయలు కల్పించాలని ప్రసూతి సహాయం కొరకు లక్ష రూపాయలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నూతన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ అధ్యక్షులు గాజులపల్లె సూర్యకుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ మహబుబ్ వళి, 9 మంది కార్యవర్గ సభ్యులు కిరణ్ భాష, పెద్ద మస్తాన్, చిన్న ఉసేన్ పీరా, సీతా ప్రతాపు చిన్న రఫీ ఇమ్రాన్ మద్దు రమణ ఎస్ భాష కోశాధికారిగా మల్లికార్జున 13 మంది గా కమిటీ సభ్యులు రాంబాబు, పెద్ద హుస్సేన్ పీరా, పీరయ్య, బాలుడు ,షరీఫ్ ,బాలాజీ, జాఫర్ ,గుర్రప్ప, కాజా ,కొడవలి భాష ,పీరావలి, ఎస్ మస్తాన్, శివ, ఎలక్ట్రిషన్ యూనియన్ గౌరవ అధ్యక్షులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవప్రసాదు ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ నాయకులు విట్టా నారాయణ, వెంకటరెడ్డి, పోరుమామిళ్ల ఎలక్ట్రిషన్లు 100 మంది పాల్గొన్నారు.

## మట్టి మాఫియాను అరికట్టడంలో రెవిన్యూ, మైనింగ్ అధికారులు విఫలం



**బద్వేలు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**
నియోజకవర్గంలో మట్టి మాఫియా బారి నుండి చెరువులను, అసైన్డ్ భూములను కాపాడాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్, చంద్రమోహన్ రాజులు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను దక్కించుకున్న కొంతమంది సబ్ కాంట్రాక్టర్లు మరియు రాజకీయ పలుకుబడి కలిగిన పెద్ద పెద్ద వాహనాల యజమానులు కొంతమంది అధికారులను లోబర్చుకొని నియోజకవర్గంలో ఉన్న చెరువులు కొండలు మరియు అసైన్డ్ డీకేటి భూములలో పెద్ద పెద్ద జెసిబిలతో అనుమతులకు మించి తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయల అక్రమ సంపాదన వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాలలో స్థానిక నాయకులు, మట్టి మాఫియా వారితో కుమ్మక్కై గుట్టలను కొండలను చదును చేసే బాధ్యత మీది ఆ స్థలాన్ని ఆక్రమించే బాధ్యత మాది అంటూ ఒప్పందాలు చేసుకుని మరీ మాఫియాకు అండగా నిలుస్తున్నారన్నారు. వర్షపాతం తక్కువగా ఉండి అంతంత మాత్రం గానే వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్న రైతాంగానికి మట్టి మాఫియా వలన మరింతగా నష్టపోయేలా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు జకరయ్య నియోజకవర్గ నాయకులు రామరాజు, బాబు , శివరాం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఆర్మీ ఉద్యోగి గుండెపోటుతో మృతి

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**



బద్వేల్ పట్టణంలోని సుమిత్ర నగర్ లో నివాసం ఉంటున్న మాజీ ఆర్మీ ఉద్యోగి నాగదాసరి విజయ భాస్కర్ (49) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన ఆర్మీలో సిపాయిగా 18 సంవత్సరాలు విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందారు. తర్వాత అవుల్దారిగా ఆరు సంవత్సరాలు పనిచేస్తూ పదవి విరమణ పొంది తర్వాత తిరుపతి సిమ్స్ హాస్పిటల్స్ నందు సెక్యూరిటీ ఆఫీసర్‌గా, ప్రస్తుతం కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ నందు సెక్యూరిటీ ఆఫీసర్ గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మృతితో సుమిత్రా నగర్ శోక సముద్రంలో మునిగింది. మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

## మార్చి 3 వ తేదీ తలనీలాల వేలంపాట

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**
భూతభవిష్యత్ వర్తమానకలజ్ఞాని రచించిన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానము నందు భక్తులు సమర్పించు తలనీలాల వేలంపాట 03/03/2025 వ తేదిన నిర్వహిస్తున్నామని దేవస్థాన ఫిట్ పర్సన్ శంకర్ తెలిపారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారికి భక్తులు సమర్పించిన తలవెంట్రుకలు వసూలు చేసుకొని హక్కునకు వేలం పాట లో పాల్గొన్న దలచిన వారు నేరుగా దేవస్థానం వారికి డి డి ల రూపంలో 25 లక్షల రూపాయలు చెల్లించవలయును. అని, అలాగే వెబ్సైట్ ద్వారా www eprocurementgovn నందు నమోదు చేసుకోవచ్చు. కాబట్టి 22/02/2025 వ తేది నుండి 03/03/2025 సోమవారం ఉదయం 10 గంటలకు వెబ్సైట్ క్లోజ్ ఔతుందని ఆయన తెలిపారు, ఈ వేలంపాట దక్కించుకున్న వారికి 01/06/2025 నుండి 31/05/2026 వరకు ఒక సంవత్సరం మాత్రమే హక్కు ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్యముగా సరైన బిడ్ రాని యడల వేలం పాట నిలుపుదల చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని ఎవరికి కారణం చెప్పకుండానే దేవస్థాన ఫిట్ పర్సన్ కు మేనేజర్ కు అధికారం కలదని ఆయన తెలిపారు. కావున పై విషయాలు భక్తులు, టెండర్ దారులు గమనించి డిపాజిట్ చేయవలెనని ఆయన తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కలికిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**
కలికిరి-మదనపల్లె రోడ్డు మార్గంలోని జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చెరువుముందరపల్లెకి చెందిన శంకర్(45) అనే వ్యక్తి గుదిరికి చెందిన సామాన్లు ఏరుకుంటుండగా మదనపల్లె వైపు నుంచి కలికిరికి వస్తున్న ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో శంకర్ మృతి చెందాడు. మృతుని భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కలికిరి సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## మేడికుర్తిలో ఉచిత వైద్యశిబిరం విజయవంతం

**కలికిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**
మండలంలోని మేడికుర్తి గ్రామంలో శ్రీనివాస చారిటబుల్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. తిరుపతిలోని ప్రముఖ మెడిగో హాస్పిటల్‌కు చెందిన గైనకాలజిస్టులు మరియు తదితర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం విజయవంతంగా జరిగింది. శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ డా.పీవీ బ్రహ్మారెడ్డి, ట్రస్టు సభ్యులు శ్రీనవాస్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, డా.జిలానీ, డా.షమీం, షబ్బీర్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి వినూత్నతమైన ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అలాగే ఈ కార్యక్రమాన్ని ఆర్థిక సహకారం అందిస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యానికి వైద్యశిబిరంలో పాల్గొన్న ప్రజలు, రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్మికులుచే ముమ్మరంగా పారిశుద్ధం పనులు

**రామసముద్రం పిబ్రవరి23 ప్రభాతవార్త**



మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీలోని పెద్దకురప్పల్లె గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి పారిశుధ్య పనులు కార్మికులుచే నిర్వహించారు. సురేంద్రబాబు మాట్లాడుతూ సీజనల్ రోగాలు రాకుండా ఉండాలంటే మురికి కాలువలు శుభ్రంగా ఉండాలని ఇంట్లో ఉన్న తొట్టెలలో నీటిని మార్చుతూ ఉండాలని నీళ్లు నిలువ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసుకోవాలన్నారు. ఇంటంటా చెత్త సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప నాయుడు, పంచాయతీ సెక్రటరీ సురేంద్రబాబు, హరిప్రసాద్ నాయుడు, అమర భూలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్వీమోహన్‌రెడ్డిని కలిసిన మండల వైసీపీ నాయకులు

**రామసముద్రం పిబ్రవరి 23 ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మూగవాడి పంచాయతీ గ్రామ పంచాయతీ గొల్ల పల్లె గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు సుజ్ఞాన మూర్తి, రెడ్డివీరేగౌడ్, గంపనపల్లె సుబ్రహ్మణ్యం కర్నూల్ వైసీపీ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్వి మోహన్ రెడ్డి సుజ్ఞానమూర్తి తో నియోజకవర్గం,మండల వైసీపీ పార్టీ గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో కర్నూల్ వైసీపీ పార్టీ అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి వెంటనే స్పందించి త్వరలోనే మదనపల్లి వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నా సుజ్ఞానమూర్తి, రెడ్డివీరేగౌడ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్



**రామసముద్రం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**
అసోసియేషన్(APPRME) పూర్వపు పుంగనూరు సమితి అధ్యక్షులుగా రామసముద్రంMPDO ఆఫీస్ AO గా పనిచేస్తున్న గౌస్ బాషాను మదనపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్ గా రెడ్డెమ్మ, జనరల్ సెక్రటరీ సతీష్ కుమార్, కోశాధికారి సతీష్ బాబు, జాయింట్ సెక్రటరీ రమాదేవి, జిల్లా కౌన్సిల్ మెంబర్లు బాలాజీ, రామమూర్తి, కోఆప్షన్ మెంబర్ నాగరాజ ఎన్నికయ్యారు.

## ఇంటింట న్యాయ ప్రచారం

**కడప లీగల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు గౌరవ ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జి.శ్రీదేవి, ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఇన్‌ఛార్జి సెక్రటరీ శ్రీమతి కె.ప్రత్యూష కుమారి ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ప్రచారం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి న్యాయ ప్రచారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు మరియు నివారణ కోసం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 46 టీంలు ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారా లీగల్ వాలంటరీ, ఒక ఏఎన్ఎం, ఒక ఆశా వర్కర్, అంగన్‌వాడీ వర్కర్, వైద్యాధికారి, భవిత సెంటర్ నిర్వాహకులు మొదలైన వారు పాల్గొంటారు. ఈ టీం ఇంటింటా న్యాయాన్ని ప్రచారం నిర్వహించి అర్హులను గుర్తించడం జరుగుతుంది. వారికి తగు సహాయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించబడుతుంది. ఈ సదవకాశాన్ని ప్రత్యేక పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నల్సా వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు మరియు మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024 పథకాలను ప్రవేశపెట్టింది. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్‌నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను వివరించారు. ఇంటింటా న్యాయ ప్రచారంలో జిల్లా వ్యాప్తంగా 5202 గృహాలను విజిట్ చేయడం జరిగిందన్నారు. అందులో 69 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించడం జరిగింది. ఏమైనా సమస్యలుంటే కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటరీలు, ఏఎన్‌లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవితా సెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక ఎత్తడంతో అడుగంటిపోయిన భూగర్భ జలాలు

### ఇసుక ట్రాక్టర్ల అడ్డుకున్న ప్రజలు... లబోధిపోమంటున్న వీరబల్లి మండల ప్రజలు

**రాయచోటి ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

మా ప్రాంతం నుంచి దూర ప్రాంతాలకు ఇసుక తరలించవద్దంటు అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో గ్రామస్తులు ట్రాక్టర్లను ఆదివారం నిలిపివేసి అడ్డుకున్నారు. మాండవ్య నది పరిధిలో ఆరు నెలలుగా ఇసుకను ఎత్తడంతో నది పరివాహ ప్రాంతంలోని ప్రభుత్వ బోర్లతో పాటు రైతులకు సంబంధించిన బోర్లలో కూడా బోకర్ భుజాలు అడుగంటి పోవడంతో తమ పంట పొలాలు మీరు ఎలా చేయాలి అని తీవ్ర ఆవేదనతో అధికారులు ఎదుట వాపోయారు ఆరు నెలల నుంచి రెవిన్యూ పోలీస్‌కు తెలుపుతున్న ఇసుక ట్రాక్టర్‌లను ఆపక పోవడంతో నిత్యం వందలాది ట్రాక్టర్లు ఇసుక నిత్యం రాయచోటి రామాపురం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు దీంతో చేసేదేమీ లేక వీరబల్లి గ్రామ ప్రజలే జోక్యం చేసుకొని ఇసుక ట్రాక్టర్లను ఆపారు. ఈ సమయంలో పోలీసులు జోక్యం చేసుకొని రేపు అధికారులతో మాట్లాడి ఇసుక సమస్యపై తగు నిబంధనలు చేపడుతమని తెలపడంతో గ్రామస్తులు శాంతించి ట్రాక్టర్లను వదిలిపెట్టారు. గత ఆరు నెలలుగా అక్రమ ఇసుక ఆగడాలకు బోసిపోయిన మాండవ్య నది. అడిగింటిన బూగర్భ జలాలు నీటి సమస్యతో సతమతమై ఏమి



చేయలేక నే రోడ్డుపై తామే వచ్చామని ప్రజలు తీవ్ర ఆవేదంతో వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉచిత ఇసుకను కేవలం మండల పరిసర ప్రాంతంలోని అభివృద్ధి పనులకు గాని లేక ప్రజల అవసరాలకు గాని మాత్రమే కోలుకోవాలని అలా కాదని మండలం దాటి రాయచోటి తదితర ప్రాంతాలకు తరలించే ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలంటూ వీరబల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## మానవతా సంస్థ చేయూత



**పులివెందుల రూరల్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**

మానవతా సంస్థ సభ్యులు చేయూత అందించారు. తల్లిదండ్రులు లేని ఇంటర్ ద్వితీయ సంవత్సరము చదువుతున్న నిరుపేద అయిన నవీన్‌కుమార్‌కి రూ 5000 ఆర్థిక సహాయం అందించారు. మానవతా నెలవారి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ డివి కొండారెడ్డి, సెక్రటరీ కే గంగిరెడ్డి, కోశాధికారి బండి హరిచంద్రరెడ్డి, డైరెక్టర్స్ డి సదాశివరెడ్డి ముక్కోటి శేషయ్య, కే నారాయణరెడ్డి, బండి శివరామరెడ్డి గంగిరెడ్డి పి కృష్ణమూర్తి శంభురెడ్డి, మానవతా సభ్యులు పాల్గొని సంస్థ సేవలను విస్తృతము చేయవలసినదిగాను, సేవా కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనవలసినదిగా సూచించారు. సమావేశానికి హాజరైన సభ్యులకు టి రాజేశ్వర్‌రెడ్డి ఈసీ మెంబర్ హెల్త్ అల్పాహారమును ఏర్పాటు చేశారు.

## మానవతకు బీరువా వితరణ



**వేంపల్లె, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**

సమాజంలోని అభాగ్యులకు, అనాథలకు, పేద ప్రజలకు అండగా నిలుస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాత బీరువా వితరణ చేసినట్లు వేంపల్లె మండలశాఖ ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం మానవత అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్ ఆధ్వర్యంలో మాసాంతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత లక్ష్యాలు, దిశానిర్దేశాలు, పలు సేవా అంశాలపై చర్చించారు. అలాగే ఫిజియోథెరపి వైద్యుడు, మానవత ఉపాధ్యక్షుడు డాక్టర్ యోగేశ్వర్ బాబు తన సొంత డబ్బులతో బీరువా వితరణ చేయడం పట్ల కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రాంతీయ ఛైర్మన్ చల్లా బాలాజీ, కార్యదర్శి శివ, కోశాధికారి శ్రీకళ, సభ్యులు డాక్టర్ రాజారాం, డాక్టర్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనాధశవంకు అంత్యక్రియలు

**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 23 ప్రభాత వార్త**



మండలంలోని మర్రిచెట్టు ఆలయము బయట ప్రాంగణంలో ఉంటూ చుట్టుపక్కల వారి సహాయ సహకారాలతో జీవనం సాగిస్తున్న అనాధవ్యక్తికి తీవ్ర అనారోగ్యం కారణంగా అనుకోకుండా ఆదివారం సాయంకాలం ఉన్నట్టుండి బోర్ల పడిపోయి శవమై కనిపించాడు. దీంతో స్థానికులు గమనించి పాలకరించెందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. పాత్రికేయులుకు సమాచారం అందించగా ఆ గ్రామ పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, విఆర్‌ఒకు తెలిపారు. గ్రామ సర్పంచ్ గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, వీఆర్వో పుష్పరాజ్, ఏఎస్ఐ మస్తాన్, వీఆర్‌ఏ సుందరం తో పాటు, లక్కిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ రాజారెడ్డి, స్థానిక ఉపాధ్యాయులు రామచంద్రలు అనాధ శవానికి అంత్యక్రియలు ఏర్పాటు చేశారు .అంత్యక్రియలకు కావలిసిన సహాయ సహకారాలను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహాయంతో పాటు మానవతా స్వచ్ఛంద సంస్థ బాలసుబ్రమణ్యం రాజారెడ్డి శివయ్య డాక్టర్ సిపి నాయక్ ఆధ్వర్యంలో స్థానికులు, రెవెన్యూ, సర్పంచ్ కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన వారిని గ్రామస్తులు అభినందించారు.

## సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు



**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**

శ్రీనివాస నగర్ లోని సైదా గారి వీధిలో సమాచార హక్కు చట్టం గురించి మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్, ఎంపీజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ అబ్దుల్ ఖదీర్, ఏపీసిఆర్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ అబ్దుల్లా హాజరై సమాచార హక్కు చట్టం గురించి ప్రసంగించారు. అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ఎంపీజే పిడితుల గొంతుక అని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని, ప్రజలను చైతన్యవరిచెందుకు సమాచార హక్కు చట్టాన్ని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మరో ముఖ్య అతిథి యంపీజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ షేక్ అబ్దుల్ ఖదీర్ సామాజిక సమస్యలు పరిష్కారాల గురించి వివరించారు. ఏపీసిఆర్ కార్యవర్గ సభ్యులు అబ్దుల్లా ఆర్టిఐ చట్టం గురించి సవివరంగా వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం ఎంపీజే ఆశయాలు లక్ష్యాల గురించి వివరించారు. జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ ఉమ్మి సమాజ పరిస్థితి, యంపీజే చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. యంపీజే రాయలసీమ ఇంఛార్జి పి అయ్యూబ్ ఖాన్ మాట్లాడుతూ అక్టోబర్ 12న జరుగనున్న యంపీజే రాయల సీమ కాన్ఫరెన్స్‌ను విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, పట్టణ కార్యదర్శి రఫీ, నజీర్, రవి, మొహ్సిన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల లబ్ధికి రైతులు పంట నమోదు



**తంబళ్లపల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ః**

మండలంలోని రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏఈఓలు సురేష్, అంబేద్కర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని సచివాలయాలలో రైతులకు ఈ కేవైసీ, పంటల నమోదుపై అవగాహన సదస్సు తోపాటు వ్యవసాయ సస్యరక్షణపై సూచనలు చేశారు. రైతులు ఆరు తడిపంటలు, పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించి అదే విధంగా క్రిమిసంహారక మందులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వ్యవసాయంపై అవగాహన పెంచుకొని వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. అవగాహన కార్యక్రమాలలో సంబంధిత సచివాలయాల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**వేంపల్లి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**

వేంపల్లెలోని ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), అవోపా మహిళా విభాగ్, నవీన్ న్యూరో కేర్ (కడప) సంయుక్త ఆధ్వర్యంలో వేంపల్లె పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా న్యూరో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కడపకు చెందిన ప్రముఖ న్యూరో డాక్టర్ నవీన్ ప్రసాద్ 305 మందికి ఉచితంగా వైద్యమందించి మందులు పంపిణీ చేశారని తెలిపారు. ఇందులో భాగంగా షుగర్ వ్యాధి పరీక్ష, బీపీ వ్యాధి పరీక్ష, రూ.3,000 విలువ చేసే ఎముకల సాంద్రత పరీక్ష, రూ.2,000 విలువ చేసే నరాల పటుత్వ పరీక్షలు, తదితర జబ్బులకు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవోపా మరియు అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కొప్పల

**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కడప నియోజకవర్గానికి చెందిన కొప్పల శివ యాదవ్ ను నియమించినది. కొప్పల శివ యాదవ్ మాట్లాడుతూ బీసీ సంఘాలతో దశాబ్దాల కాలం పని చేసినట్లు చెప్పారు. చేసిన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజిద్ భాషా, కడప నగర మేయర్ కొత్తమద్ది సురేష్ బాబు, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి, ప్రజా సంక్షేమ కోసం పాటుపడతానన్నారు. పార్టీకి మూల స్తంభాల లాంటి కార్యకర్తల కోసం సమయం వెచ్చిస్తానని, గురుతర బాధ్యతగా పనిచేస్తానని చెప్పారు.

## ఎంపీ నిధులతో అభివృద్ధి

**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**



ఎంపీ నిధులతో పీలేరు పంచాయతీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారని పీలేరు సర్పంచ్ హబీబ్ భాషా అన్నారు. ఆదివారం ఈ మేరకు ఆయన కల్లూరులో పర్యటిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ నిధుల కింద రావాల్సిన నిధులను సకాలంలో మంజూరు చేయించవలసిందిగా కోరినట్టు సర్పంచి తెలిపారు. ఎంపీ నిధులతో పీలేరు పంచాయతీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**లక్కీరెడ్డిపల్లి; ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

మండలంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి శివశంకర్ రెడ్డి జనార్దన్‌రెడ్డి సునీల్‌రెడ్డి, శ్రీధర్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులను సమ్మేళనం చేశారు. 1986, 87 సంవత్సరం నందు దాదాపు 240 మంది విద్యార్థులు 39 ఏళ్ల పూర్తి కావడంతో గురువుల తో కలిసి వైభవంగా నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అందరు ఒకే వేదికపై కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షులు ఎంపీపీ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు అనంతరం పాఠశాల హెచఎం వెంకటేశ్వర్లు జ్యోతిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయులు నాగముల్లారెడ్డి లోకనాథ్ రెడ్డి రఘునాథరెడ్డి ఈశ్వర్ రెడ్డి షంషీర్ ఖాన్, చెన్నంరాజు, రత్నమ్మ, రఘురామయ్య, పూలమాలలతో, దుశాలవతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. 39 ఏళ్ళ తరువాత కూడా తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు పురుషోత్తం విశ్వనాథరెడ్డి ఆంజనేయ రెడ్డి అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రూ 10 లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరు



**ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**

కాలేయ వ్యాధితో బాధపడుతున్న సకిలి అశోక్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన రూ.10 లక్షలకు సంబంధించిన మంజూరు పత్రాన్ని స్థానిక శ్రీరాములుపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ వైద్యులు వరుణ్‌కుమార్ రెడ్డిలు అందజేశారు. తాళ్లమాపురం గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి కొన్ని నెలలుగా తీవ్ర కాలేయ వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి సమస్యను తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అతని చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనుండు రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన మంజూరు పత్రాన్ని రోగి సోదరుడు సకిలి వెంకటసుబ్బారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి సోదరుడు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని తమ కుటుంబానికి మంత్రివర్యులు సత్యకుమార్‌యాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందజేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు భాస్కర్ రెడ్డి, షేక్షావలి, జగన్మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఝురి మహోత్సవ ప్రాంతాన్ని పరిశీలించిన డిఎస్‌పి



ఝురి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి, ఎస్ఐలు

**కలకడ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**

ఝురి మహోత్సవ ప్రాంతాన్ని రాయచోటి డి.ఎస్.పి కృష్ణమోహన్ పరిశీలించారు. మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు. జరి మహోత్సవ కార్యక్రమం మహాశివరాత్రి రోజున భక్తులు శ్రీ కామాక్ష సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జాగరణ నిర్వహించి మరుసటి రోజు గురువారం వేకువజామునే శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఝురి మహోత్సవ ప్రాంతానికి బయలుదేరి వెళ్లను ఆనమైతిగా జరుగుతున్న ఆచారం ఈ నేపథ్యంలో భక్తులు శివపార్వతుల వెంట బయలుదేరి గురువారం నుండి సాయంత్రం 6 గంటలకు జరుగు మహోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని డిఎస్పి తెలిపామన్నారు. జరి మహోత్సవ ప్రాంతానికి భక్తులను చేరవేసేందుకు పీలేరు, మదనపల్లి, రాయచోటి డిపోలకు చెందిన బస్సులు వేయడం జరుగుతుందని వాటిలోనే భక్తులు ప్రయాణించాలని అందుకు తమ సిబ్బంది సహకారం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలకడ, కేవీ పల్లి ఎస్ఐ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తాం



**లక్కిరెడ్డిపల్లె; ఫిబ్రవరి 23, ప్రభాత వార్త**

మార్చి 1,2 తేదీలల్లో జరగబోవు గంగమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాటు చేస్తామని రాయచోటి డిఎస్పీ క్రిష్ణమోహన్ పేర్కొన్నారు ఆదివారం గంగమ్మ జాతరలో ఏర్పాటులను అమ్మ వారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లు, ఔట్ క్యూలైన్లను పరిశీలించారు 300 టికెట్ల క్యూలైను 100 30 రూపాయల ట్టూ ఏర్పాట్లును పరిశీలించారు. వాహనాల పార్కింగ్లు, ఆర్టీసీ బస్సుల నిలుపు బస్టాండ్లు ఏర్పాటు చేయాలని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులను నియమిస్తామని మద్యం, బెల్ట్ షాపులను ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు దొంగతనాలు జరగకుండా గట్టి బందో బస్తు ఏర్పాటు చేస్తామన్నారు చాందిని బండ్లు 10 అడుగుల కన్న ఎక్కువ ఎత్తు ఏర్పాటు చేయకూడదని చాందినీ బండ్లు ఏర్పాటు చేసేవారు ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలన్నారు ఎటువంటి అంతరాయం కలగుకుండా ఎప్పటికప్పుడు విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీంద్ర బాబు, ఈవో శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

**వాల్మీకిపురం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**



పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను వాల్మీకిపురం మండల ఎంఆర్పిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం అనంతపురం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి విచ్చేసిన భారతదేశ అత్యున్నతమైన అవార్డు గ్రహీత పద్మశ్రీ మందకృష్ణ మాదిగను కలిసి సమావేశ అనంతరం సన్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీ మండల గ్రామాల్లో నూతన కమిటీలను బలోపేతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ పీలేరు నియోజకవర్గ కో ఇన్చార్జ్ అమరాల వెంకటరమణ, వాల్మీకిపురం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గంతా బాలకృష్ణ, ఎంఈఎఫ్ నాయకులు సంగీతం రవిశ్వరయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మధు పాల్గొన్నారు.

## బాలికలకు పరీక్షా సామాగ్రి పంపిణీ



స్టేషనరీ సామాగ్రిని ఉచితంగా అందుకుంటున్న విద్యార్థులు

**పోరుమామిళ్ళ రూరల్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**

కమ్మవారిపల్లె, పెండ్లిమర్రి, వరికుంట్ల, కాసానగరం గ్రామాల్లో ఉన్న నాలుగు కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న 331 మంది బాలికలకు ఆదివారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పబ్లిక్ పరీక్షలు రాయటానికి అవసరమైన అట్టలు, పౌచ్‌లు, హాల్ టికెట్ కవర్లు, పెన్నులు, పెన్సిల్లు వంటి స్టేషనరీ సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ దాతల సహాయంతో పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. జీవిత లక్ష్య సాధన కోసం పక్కా ప్రణాళిక ఏర్పరచుకోవాలని, పరీక్షల పట్ల భయాన్ని విడనాడాలని బాలికలకు ఆయన సూచించారు. పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు యం. రాజశేఖర్‌రెడ్డి, కె. కిరణ్‌కుమార్, జూనియర్స్ వాలంటీర్స్ పి. వివేకానందరెడ్డి, పి. కుషల్‌కుమార్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు

**లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు యాదవ్, చెల్లు దినేష్ యాదవ్ లు అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించార భక్తులు క్యూ లైన్లో వెళ్లి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు దినేష్ యాదవ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఈవో శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి, మార్కండేయ, నాగేశ్వరి సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## అసౌకర్యం కలిగించకుండా చర్యలు తీసుకోవాలి

**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**



మండలం తలుపుల పంచాయితీ పరిధిలో వెలిసినటువంటి శ్రీమద్ గుండాల మల్లేశ్వర స్వామి దేవస్థానం నందు శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆదివారం పీలేరు సిఐ పోలీస్ సిబ్బందితో కలిసి దర్శించడం జరిగింది. అక్కడ రాబోయే భక్తులందరూ వారి వాహనాలను ఒక క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసుకునే దానికి అనుకూలంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే భక్తులు దర్శనం చేసుకునే దానికి కూడా క్యూ పద్ధతిని అనుసరించి ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకునే దానికిగాను క్యూ లైన్స్ ఏర్పాటు చేయబడ్డాయి. అలాగే ఝురి స్నానాలు చేసే సమయంలో భక్తులు నీటి కుంటల దగ్గర తగిన జాగ్రత్తలు తీసుకొని, దేవాదాయ కమిటీ వారు సూచించిన ప్రదేశంలో మాత్రమే వారు స్నానాలు చేయవలెనని లోపల అనుమతి లేని ప్రాంతాలలో ఎట్టి పరిస్థితుల్లో ప్రవేశించవద్దని తెలియజేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండవలెనని మనవి. దేవాలయ పరిసర ప్రాంతం అంతా కూడా సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంటుంది.

## రోజు రోజుకు పెరుగుతున్న భూ సమస్యలు

**రైల్వేకోడూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**

మండలంలోని జంగిటివారిపల్లె మొలకలపాడు గ్రామానికి చెందిన రైతులు స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్దే బాహాబాహి ఘర్షణలకు దిగిన సందర్భం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఇరు వర్గాలకు చెందిన భూములు కొన్ని రకాల ఇబ్బందులు ఎదురు కావడంతో కార్యాలయం వద్దకు రాగానే మాట మాట పెరిగి కార్యాలయం వద్దే బహిరంగంగా కొట్టుకున్నట్లు స్థానికులు తెలిపారు. కేవలం భూ ఆక్రమణల పై కొన్ని గ్రామాలలో పూర్తిస్థాయిలో ఘర్షణలకు దిగుతున్న సందర్భంలో ఎట్టకేలకు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలోనే కొట్టుకోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో భూవివాదాలను అణచివేయాలని స్థానికులు కోరుతున్నారు.

## విశ్వహిందూ పరిషత్ కార్యాలయం ప్రారంభం

**రైల్వే కోడూరు ఫిబ్రవరి 23 ప్రభాత వార్త**

మండలంలోని రాజా నగర్ సమీపంలో సో ఫ్యాక్టరీ విశ్వహిందూ పరిషత్ కార్యాలయం ప్రారంభించినట్లు అధ్యక్షులు వెంకటరెడ్డి ఉమ్మల రాజు సురేష్ రాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా విభాగ కార్యదర్శి శ్రీనివాస నాయుడు పోకల ప్రభాకర్ జిల్లా కార్యదర్శి రెడ్డయ్య రాజు సుకవాసి మల్లికార్జున మణి బజరంగదళ్ వెల్లటూరి వెంకయ్య రాజు కరుణాకర్ రెడ్డి భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు పులపుత్తూరి రాసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. హిందువులందరికీ అందుబాటులో ఉంటామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.



## పది కుంటల పొలంలో 20 రకాల ఆకు,కూరగాయలు

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ః**

పూర్తిగా ప్రకృతి వ్యవసాయంతో సేంద్రియ ఎరువులు, కషాయాలతో కూరగాయల పంటలు పండించి ఆదర్శంగా నిలిచిన మహిళా రైతు. పరసతోపు పంచాయతీ గొళ్ళపల్లెవారి పల్లెకు చెందిన రైతు రాజారెడ్డి భార్య సుగుణమ్మ ప్రకృతి వ్యవసాయ సలహాదారుగా పనిచేస్తుంది. ఇందులో భాగంగా ఆమె సొంత పొలంలో కేవలం 10 కుంటల్లో టమోటా, వంగ, బెండ, బీర, ముల్లంగి, క్యారెట్, బీట్రూట్, క్యాప్సికమ్, గోరుచిక్కుడు, చిక్కుడు, తోటకూర, గోంగూర, పుదీనా, కొత్తిమీర, మెంతి ఆకు, చిర్రాకు, పాలఆకు, ఉల్లికాడలు, మునగాకు, సొసవలఆకులు పండించి ఆదర్శంగా నిలిచింది. ప్రతి సోమవారం తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పౌష్టికాహార వంటకాలు తక్కువ ధరకు అమ్మకానికి పెడుతోంది. ఎలాంటి క్రిమిసంహారక మందులు లేకుండా స్వచ్ఛమైన సేంద్రియ ఎరువులు, కషాయాలతో పండిన పంటలు కావడంతో అధికారులు, మహిళా సంఘాలు, ప్రజలు కొనడానికి ఎగబడుతున్నారు. ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయంతో సేంద్రియ ఎరువుల పంటల ఫలసాయాలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సైతం హితవు పలుకుతున్నారు.



ప్రకృతి వ్యవసాయ పంటల సాగులో సుగుణమ్మ

## వృద్ధురాలి మృతి పై కేసు నమోదు

**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**

మండలం రేగళ్ల పంచాయతీ ఎల్లంపల్లికి చెందిన మునిబాయమ్మ (70) కుమారుడు చంగల్ రాయుడుకు పార్వతి జగదీశ్వరి ఇద్దరు భార్యలు చిన్న కోడలైన జగదీశ్వరితో మునుభాయమ్మ ఆదివారం గొడవ పడింది ఈ క్రమంలో వృద్ధురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది ఆమెను ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు ఈ మేరకు తమ అత్త మృతిపై అనుమానాలు ఉన్నాయని పెద్ద కోడలు పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ యుగంధర్ తెలిపారు.

## 20 లీటర్ల నాటు సారా స్వాధీనం,

**కలకడ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**



20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు. మండలంలోని దిగువ తాండ పంచాయతీ ఎగువతాండ పడమటి వైపున నాటు సారా వండుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎగుతాండాకు చెందిన తిరుపాల్ నాయక్ సుమారు వంద లీటర్ల నాటు సారా తయారు చేయడానికి ఉంచిన సారా ఊట ను ధ్వంసం చేసి, తయారు చేసి ఉంచిన 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని తిరుపాల్ నాయక్ ను అరెస్ట్ చేసి కోర్టు హాజరపరిచినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడులలో యూనస్ ఇమాన్, డ్రైవర్ రమేష్, బాబు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన హౌసింగ్ అధికారులు


ఇటీవల హౌసింగ్ కాలనీల అధికారులతో తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్


పీలేరు హౌసింగ్ కార్యాలయం

**పీలేరు, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
నియోజకవర్గంలో హౌసింగ్ అధికారుల సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు పిడి ఆదేశాలు. శనివారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ జిల్లా కేంద్రం రాయచోటిలో కలెక్టరేట్ సమీక్ష సమావేశంలో గృహ నిర్మాణాల కార్యక్రమాలపై జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా అర్హులైన నిరుపేద లబ్ధిదారులను గుర్తించి అవకతవకలు జరగకుండా హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని దానితోపాటు 2019వ సంవత్సరముకు ముందు తమ సొంత స్థలాలలో ప్రభుత్వ భూములలో ఇల్లు నిర్మించుకొని జీవనము సాగిస్తూ అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను తెలియజేసి వారి ఇల్లు స్థలాలను క్రమబద్ధీకరించాలని ఆదేశించడంతో జిల్లా హౌసింగ్ అధికారులలో కూడా చలనం మొదలైంది. ఎట్టికెలకు జిల్లా హౌసింగ్ పీడీ సాంబ శివయ్య స్పందించటం తో పాటు ఎట్టికేలకు నియోజకవర్గాలలో హౌసింగ్ అధికారుల కింద స్థాయి నుండి ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని భావించి మొట్టమొదటిగా ఈనెల 25వ తేదీన మంగళవారం పీలేరు హౌసింగ్ డివిజన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ పీడీ తెలియజేశారు అదేవిధంగా నియోజకవర్గంలో ఉన్న కేవీ పల్లి, కలకడ, కలికిరి, పీలేరు, వాల్మీకిపురం మండలాలలో ఉన్న హౌసింగ్ అధికారులు సమావేశానికి హాజరై ఇప్పటివరకు జరిగిన లబ్ధిదారుల ఎంపిక గతంలో మంజూరైన గృహాల స్థితిగతులు తీసుకొని రావాలని ఆయన ఆదేశించినట్లు తెలిపారు.

**కదిలిక లేని పీలేరు హౌసింగ్ అధికారుల పనితీరు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి సంబంధిత మంత్రి నియోజకవర్గ శాసనసభ్యులు పార్లమెంటు సభ్యులు పలు సమీక్ష సమావేశాలలో గృహ నిర్మాణాల స్థితిగతులపై పత్రిక ప్రకటనలు చేస్తూ లబ్ధిదారులకు సూచనలు తెలియజేయడం తెలిసింది అయితే పీలేరు హౌసింగ్ అధికారుల తీరు అందుకు భిన్నంగా ఉంది అనటంలో సందేహం లేదు. ఇప్పటివరకు పత్రికలకు సైతం గృహ నిర్మాణాలపై ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలుస్తుంది మండల స్థాయిలో నియోజకవర్గంలో ఉన్న రెవెన్యూ అధికారులు చుట్టూ హౌసింగ్ లబ్ధిదారులు పథకంపై నమోదు చేసుకొనుటకు సూచనలు తెలుసుకోవడానికి కార్యాలయం చుట్టూ పరుగులు పెడుతున్న హౌసింగ్ అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలకు కొల్లలుగా ఉన్నాయి జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహించి సూచనలు చేసేంతవరకు హౌసింగ్ అధికారులలో చలనం లేకపోవడంతో ఉన్నత స్థాయి అధికారుల సైతం హౌసింగ్ అధికారులకు చురకలు అంటించడం మొదలైందని చర్చ జరుగుతుంది. హౌసింగ్ అధికారులలో చలనం రావటం హర్షించదగ్గ విషయమే లబ్ధిదారులు. హౌసింగ్ శాఖ జిల్లా అధికారి పీడి సాంబశివయ్య ఈనెల 25వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా గృహాల మంజూరు వాటి స్థితిగతులపై అధికారులకు సూచనలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని నాయకులు లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా హౌసింగ్ అధికారుల్లో చలనం మొదలై హౌసింగ్ లబ్ధిదారులు నమోదు చేసుకొనుటకు సూచనలు సలహాలు పత్రికల ద్వారా తెలియజేస్తే మంచిదని అలాగే జరుగుతుందని ఆశిద్దాం

# కంటి చికిత్సకై అత్యాధునిక లేజర్ మిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయం

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్**

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ః**
కంటి చికిత్సకై రాయలసీమలోనే మొట్టమొదటిసారిగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వైవి స్వరూప్‌కుమార్‌రెడ్డి ప్రొద్దుటూరులో స్కయండ్ అమరీస్ అనే అత్యాధునిక లేజర్ మిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై సత్యకుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక వైవిస్వరూపమారెడ్డి కంటి ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన లేజర్ యంత్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ప్రొద్దుటూరు పట్టణంలో కంటి వైద్య నిపుణులుగా ప్రజల మనసులో నిలిచిపోయారన్నారు. పట్టణంలో ఎక్కువగా పేద మధ్యతరగతి దిగువ మధ్యతరగతి ప్రజలు ఉన్నందున వారసత్వంగా సేవా తత్వాన్ని అలవర్చుకొని ప్రజలకు కంటి వైద్య సేవలు అందించడం ఆయనకే చెల్లింది అన్నారు. అంతేకాకుండా పెద్ద పెద్ద నగరాలలో ఉండే కంటి వైద్య ఆధునిక లేజర్ మిషన్ ఏర్పాటు చేయడంలో ఆయన ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. భవిష్యత్తులో ఆయన ప్రొద్దుటూరు ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించి ప్రజాభిమానాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కంటి చికిత్సలలో అత్యంత ఆధునికమైన లేజర్ మిషన్ ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి



సత్య కుమార్ యాదవ్ ప్రారంభించడం సంతోషకరమన్నారు. జర్మనీ దేశం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ తో కంటి వైద్యంలో ఇదే చివరి అత్యాధునిక మిషన్‌గా ఆయన అభివర్ణించారు. 18 ఏళ్ల నుండి 35 ఏళ్ల వరకు ఉన్న అందరికీ కంటి లో ఉండే నల్ల గుడ్డుపై పిజ్జా చేయడానికి అవకాశం ఉందన్నారు. ఈ మిషన్ ద్వారా ఎంతో మందికి కంటి చికిత్సలో మరిన్ని సేవలు అందించే భాగ్యం కలిగిందన్నారు. ఈ సమావేశంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత వంటేరు శ్రీనివాసరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, టీటీడీ మాజీ సభ్యుడు టంగుటూరి మారుతి ప్రసాద్, బిజెపి రాష్ట్ర మహిళ కోశాధికారి సివి విజయలక్ష్మి, గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి పట్టణ వైద్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసం, మనోధైర్యమే విజయానికి పునాదులు

:కష్టపడి చదివినపుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారు : ప్రిన్సిపాల్ ఆకుల నరసింహారెడ్డి







**బద్వేలు అర్బన్ ,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అపుడే చదువు నేర్పిన గురువులకు, కళాశాలలకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తెచ్చిన వారవుతారని ఉదయగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఆకుల నరసింహారెడ్డి, కళాశాల డైరెక్టర్ గంగిరెడ్డి రామలింగారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మల్లేముల లక్ష్మీనారాయణ, గాదంశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టనంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో ఫేరవల్ డే కార్యక్రమాన్ని శ్రీనివాస ఏసీ కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేపట్టి చదువుల తల్లి సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలని, ఆలక్ష్యమే ధ్యేయంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కొంతమంది విద్యార్థులు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని, అది వారికి తగదన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు స్నేహితభావంగా మెలగాలని విద్యతో పాటు క్రీడలు తదితర అన్ని రంగాలలో ముందంజలో ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలనే కష్టపడి, ఇష్టపడి చదివి పరీక్షా సమయాలలో ఒత్తిళ్లకు గురికాకుండా చదివిన పాఠ్యాంశాలను గుర్తు పెట్టుకుని రాశినపుడే తమ లక్ష్యాలను నెరవేర్చుకున్న వారవుతారన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో మెలిగి తమపై తమకు నమ్మకం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : ఎంపీ





**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వంలో కుట్రలకు బలవుతున్న ప్రతి కార్యకర్తకు వైసీపీ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైసీపీ యువనాయులు దేవసాని ఆదిత్యరెడ్డితోకలిసి ఇటీవల మృతిచెందిన మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి తల్లి తులసమ్మ, గుండెపోటుతో మృతిచెందిన గుర్రంపాటి మాధవరెడ్డి కుమారుడు, 11వ వార్డు కౌన్సిలర్ శ్రీదేవి, 15వ వవార్డు కౌన్సిలర్ భర్తతోపాటు ఇటీవల మృతిచెందిన పలు వైసీపీ కుటుంబాల నాయకులను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించి వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఇటీవల కూటమి ప్రభుత్వం పెట్టిన అక్ర కేసులలో జైలులో ఉండి విడుదలైన మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి స్వగృహానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలతో పార్టీ బలో పేతానికి చేపట్టాల్సిన చర్యలు, అలాగే నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ప్రజల పక్షాన పోరాటం చేసి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం వైసీపీ బూత్ కమిటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, కాంట్రాక్టర్ తమ్మిశెట్టి వెంకటసుబ్బయ్య,సునీల్ ఎంపీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురుమోహన్, సంబటూరు ప్రసాదరెడ్డి, పోలిరెడ్డి, రమణారెడ్డి, సుందరరామిరెడ్డి, యద్దారెడ్డి, రమేష్‌బాబు, పంగా గోపాలస్వామి, బుర్రి రాజా యాదవ్, నాగం సుబ్బారెడ్డి, వాకమళ్ల నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, బంగారు శ్రీనయ్య, బోడపాడు రామసుబ్బారెడ్డి,పుత్తా శ్రీరాములు, మల్లికార్జునరెడ్డి, సరిటాల మౌలాలి, శ్రీకాంత్‌రెడ్డి, షఫి, చాపాటి సాయినాథరెడ్డి, భూమిరెడ్డి ఓబుళరెడ్డి, తుమి క్మశెట్టి సునీల్‌తోపాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోమవారం నిత్యపూజ కోనకు రెండు బస్సులు

**కలికిరి, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**
కడప నుంచి నిత్యపూజ కోనకు సోమవారం నుంచి రెండు బస్సులు నడుపుతున్నట్లు కడప ఆర్టీసీ మేనేజర్ డిలేశ్వర రావు తెలిపారు. ఈ బస్సులు ఉదయం 7 గంటలకు ఒక సర్వీసు ఉదయం 8 గంటలకు మరో సర్వీసు కడప కొత్త బస్టాండు పాత బస్టాండు, కృష్ణా సర్కిల్, మున్సిపల్ హైస్కూల్ అప్సరా సర్కిల్, భాకరాపేట, సిద్ధవటం, వంతాటిపల్లె నిత్యపూజకోనకు వెళ్తాయి. తిరుగు ప్రయాణం భక్తుల రద్దీని బట్టి బస్సు కడప బయలుదేరుతుంది. భక్తులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. సోమవారం జరిగే డెమో స్టేషన్ సర్వీస్‌లో వచ్చే రిపోర్టు ఆధారంగా ప్రతి సోమవారం నిత్యపూజకోన రెగ్యులర్ బస్సుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్తామని డిపో మేనేజర్ తెలిపారు.

## ముక్కంటికి ముచ్చటగా మూడోసారి పుష్పాలంకరణ



**తంబళ్లపల్లె ఫిబ్రవరి 23 ప్రభాతవార్త ః**
తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండలో వెలసిన మహా శివునికి ముచ్చటగా మూడోసారి అలంకరణ భాగ్యం దక్కడం నా పూర్వజన్మ సుకృతమని గోపి దిన్నె పంచాయతీ చెరువు ముందర పల్లెకు చెందిన రియల్టర్ నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి(బెంగళూరు మల్లి)హేమలత దంపతులు తెలిపారు. మల్లికార్జున రెడ్డి వ్యాపార రీత్యా బెంగళూరులో స్థిరపడినా మల్లయ్య కొండ మహా శివుని సేవతో పాటు సామాజిక సేవ, కరోనా సమయంలో వేలాది మందికి అన్నదానం, పలువురికి ఆర్థిక సాయం అందించారు.ఆదివారం ఆయన కుటుంబం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన శివాలయం తో బాటు శివపార్వతులను పలు రకాల ఫల, పుష్పాలతో అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ తన సొంత నిధులతో చేపడుతున్నట్లు చెప్పారు. నేను ఈ స్థాయికి చేరడానికి మల్లయ్య కొండ మహా శివుని ఆశీస్సులేనని స్వామి వారి దయవల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు.

## వైఎస్ఆర్సిపి బూత్ కమిటీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యద్దారెడ్డి..!

**బద్వేల్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త**



వైఎస్ఆర్సిపి బూత్ కమిటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బద్వేల్ పట్టణానికి చెందిన ఈగ యద్దారెడ్డి నియమతులయ్యారు. ఈయన ఎమ్మెల్సీ డి సీగోవిందరెడ్డికి అదేవిధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి విధేయుడుగా ఉండడంతో ఆయనకు వైఎస్ఆర్సిపి పట్టణ విభాగ ప్రధానకార్యదర్శిగా పదవి వ. 2024 వ సంవత్సరంలో ఎన్నికల సమయంలో జేసీక స్వీనర్‌గా అదేవిధంగా పట్టణంలోనిబూత్ కమిటీ మెంబర్లను సమన్వయ పరచడంలో కీలకపాత్ర పోషించాడు ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి న అధిష్టానం ఆయనకు వైయస్సార్సీపిబూత్ కమిటీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమింనట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఇంతటి మహోన్నతమైన పదవి ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తనపై నమ్మకముతో ఇచ్చిన పార్టీ అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానన్నారు. తననుపదవికి నియామకానికి సహకరించిన ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డికి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధాలకు కృతజ్ఞతలు ఆయన తెలిపారు.

## పలు శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు తరలింపు



**బద్వేలు అర్బన్ ,ఫిబ్రవరి 23 ,ప్రభాతవార్త**
ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని బద్వేలు ఆర్టీసీ వారు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసిన ట్లు బద్వేలు ఆర్టీసీ డిఎ్న నిరంజన్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బద్వేలు డిపో నుండి శైవక్షేత్రాలైన మల్లంకొండ, లంకమల, ఎన్ఎస్ మఠం, బ్రహ్మంగారిమఠలకు బద్వేలు డిపో నుండి స్పెషల్ సర్వీస్ బస్సులను తిప్పడం జరుగుతుందన్నారు.ఇందుకోసమై భక్తుల సౌకర్యార్థం నందిపల్లి,పిపి కుంట వద్ద ప్రత్యేక పాయింట్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బద్వేలు డిపో నుండి లంకమళ్ళకు 22, మల్లెంకొండకు ఐదు, బ్రహ్మంగారిమఠంకు మూడు,నారాయణ స్వామి మఠంకు 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బస్సులలో ప్రయాణం చేయడముద్వారా ప్రమాద రహిత పుణ్య క్షేత్రాల సందర్శన సాధ్యమన్నారు.భక్తుల రద్దీని బట్టి బస్సుల సంఖ్య పెంచడం కూడా జరుగుతుందని, భక్తులకు అసౌకర్యం కలవకుండా సౌకర్యవంతమైన బస్సులు ఏర్పాటు చేయ నున్నామన్నారు.అదేవిధంగా శివరాత్రి ఉత్సవాలకై శ్రీశైల మల్లన్న దర్శనార్థం భక్తుల సౌకర్యార్థం ఆదివారం నుంచి బస్ సర్వీస్ ప్రారంభించడం జరిగిందని, ఈ బస్ ఉదయం 5.30కి బద్వేలు నుంచి బయలుదేరి పోరుమామిళ్ల, మార్కాపురం మీదుగా ప్రయానించి శ్రీ శైలం చేరుకుంటుందన్నారు. కావున భక్తాదులు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకుని, అదేవిధంగా ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకుని, ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఏవిఆర్ పాఠశాల విద్యార్థులకు నగదు బహుమతి



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**
ఏ.వి.ఆర్ పాఠశాల లోని విద్యార్థులకు నిర్వహించిన శాట్ (SAT) పరీక్ష నందు మొదటి స్థానం మరియు రెండవ స్థానం లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మొదటి స్థానం వచ్చిన ముగ్గరు విద్యార్థులకు ఒక్కొకరికి 5000, రెండవ స్థానం వచ్చిన ముగ్గరు విద్యార్థులకు ఒక్కొక్కరికి 3000 చొప్పున ఏ.వి.ఆర్ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ చంద్ర, ఏ.వి.ఆర్ పాఠశాల డీజీఎం సుబ్రమణ్యం రెడ్డి, పీలేరు ఏ.వి.ఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ శోభా ప్రకాష్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులను కాంపిటీటివ్ ఎగ్జామ్స్ లో ముందస్తులో తీసుకెళ్తూ విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ పిల్లల్ని అన్ని విధాల ప్రోత్సహించాలనేదే తమ లక్ష్యం అంటూ తెలియజేశారు.

## వైభోవహితంగా స్వామి కల్యాణం

**సిద్దవటం, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:**
సిద్దవటం మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లి సమీపాన వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మూల విరాట్ విగ్రహాలకు ఆదివారం ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో కల్యాణం వైభోవహితంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి కడప, సిద్దవటం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరయ్య శర్మ మాట్లాడుతూ కల్యాణం సందర్భంగా గణపతిపూజ, పంచామృత అభిషేకాలు, మంగళహారతి, హోమం, కంకణధార, కల్యాణం జరిగిందన్నారు. అనంతరం వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య, భక్తులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**చిన్నమండెం, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
మండలంలోని టిచాకిబండ గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ, కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో సిమెంటురోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, తదితర మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దరిమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పొల్గొన్నారు.

## నిరంతర వెలుగులకు అడ్డుకట్ట

వార్త ప్రభావం

**పీలేరు ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :**
మండల వ్యాప్తంగా పంచాయతీ పరిధిలోని నిరంతర వెలుగులకు అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం వార్త పత్రికలో వెలువడిన నిరంతర వెలుగులతో ప్రజాధనం ఆవిరి కథనంతో పీలేరు మండల విద్యుత్ శాఖ అధికారులు కదిలారు. వీధిదీపాలు నిరంతర వెలుగులకు అడ్డుకట్టు చేసేందుకు చర్యలు చేపట్టారు ఎక్కడెక్కడ వీధి దీపాలు నిరంతర వెలుగులు వెలుగుతున్నాయో గుర్తించే పనిలో పడ్డారు విడతలవారీగా నిరంతర విలువలకు అడ్డుకట్టు వేసేందుకు థర్డ్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు ఈ చర్యలతో పగటి పూట విద్యుత్ దీపాలు వెళ్లకుండా అవసరానికి మాత్రమే రాత్రిపూట వెలిగేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు ఈ మేరకు పీలేరు పట్టణంలో పలు వీధుల్లో విద్యుత్తు దీపాలకు థర్డ్ లైన్ విద్యుత్ వైర్ ను లాగుతున్నారు ఈ చర్యలతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు ఇదే విధంగా పట్టణ వ్యాప్తంగా థర్డ్‌లైన్ ఏర్పాటు చేసి నిరంతర వెలుగులకు అడ్డుకట్టు వేస్తామని ఏఈ ఇలా ఈ వార్తకు తెలిపారు.


థర్డ్‌లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## అలరించిన శాస్త్రీయ నృత్యాలు




**కడప కార్పొరేషన్ ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**
ఆటవిడుపు భాగంలో ఆదివారం కడప శిల్పారామంలో సాంస్కృతి కళావేదిక మీద మిస్సా మూవీ వారి సహకారంతో కడప నగరానికి చెందిన షర్మిల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శాస్త్రీయ నృత్యాలు నగర వాసులను అలరించాయి. సినీ, నృత్యాలు, పల్లె, జానపద నృత్యాలుతో అదరహో అనిపించారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం పరిపాలన అధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



**పులివెందుల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :**
శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. పులివెందుల కు చెందిన ప్రభాకర్ లగ్జరీ విహార్, కమ్యూనిటీ లేఅవుట్ సహకారంతో ధర్మవరానికి చెందిన రాకింగ్ డాన్స్ అకాడమీ మాస్టార్స్ లోకేష్, అస్లాం ఆధ్వర్యంలో పిల్లలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహా గణపతిం మనసా స్మరామి అంటూ సాగే ఈ పాటతో మొదలై ఆయుధ పూజ, ఇస్మార్ట్ శంకర్, రాను బొంబాయికి రాను, వచుండాయే ఫీలింగ్స్, సూసేకి అగ్గిరవ్వ మాదిరే ఉంటాడే నా సామి.. తదితెర పాటలకు చిన్నారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏవో సుధాకర్ పర్యవేక్షించారు.

## రథోత్సవంలో కనుమపోలేరమ్మ అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**
త్రికాలజ్ఞాని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారికి బళ్లారి వాస్తవ్యులు క్రీ. శే భీమినేని చిన్న ఈశ్వరయ్య భీమినేని లక్ష్మీదేవి వీరి కుమారుడు భీమినేని కాశినాయుడు సతీమణి లక్ష్మి,గ్రామ ఉత్సవ రథమును బహుకరించారు. ఈ సందర్భంగా వారు ఆదివారం రథోత్సవంలో శ్రీ కనుమ పోలేరమ్మ ఉత్సవ విగ్రహాలను శ్రీ పోలేరమ్మ గుడి చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. అలాగే మహిళలతో కోలాటం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. దాతలకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. అలాగే శ్రీ కనుమ పోలేరమ్మ గుడి ఉత్సవం భక్తులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పవన్ స్వామి, కేశవ స్వామి సిబ్బంది పవన్ కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

